చేనేత మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - కొత్తూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మంత్రి సవితని పాతపట్నం నియోజకవర్గ ఎంఎల్ఏ మామిడి గోవిందరావు కలిశారు. పాతపట్నం చేనేత కార్మికుల సమస్యలపై మంత్రి సవితకు. ఎంఎల్ఏ మామిడి గోవిందరావు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. మామిడి చెప్పింది ఆమె సావధానంగా విన్నారు. తప్ప కుండా కృషి చేస్తాను అని మంత్రి సవిత హామీ ఇచ్చారు అని ఇక్కడ మీడియాకు ఎమ్మెల్యే మామిడి తెలిపారు.

మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలి

- ఆర్.ఓ.బికి సంబంధించిన భూసేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఆర్.ఓ.బికి, సంబందించిన భూసేకరణ వేగవంతం చేసి, మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తో కలసి సంబంధిత అధికారులతో భూసేకరణ పై సమావేశం నిర్వహించారు. జమ్మూ నుండి పాతపట్నం ఎన్ హెచ్ 326ఎ రోడ్డు బైపాసు పనులకు సంబంధించి పనులపురోగతి పై సంబంధిత అధికారులతో ఆరా తీయగా వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ కి సంబంధించి ఎటువంటి సమస్యలు లేవని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. ట్రాన్స్ కో సంబంధించిన డబ్బులు ఇవ్వవలసి ఉందని ట్రాన్స్కోకు ఇవ్వడం జరుగుతుందని పనులు ప్రారంభించి మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం అన్నారు. ఎన్ హెచ్ 326%ాా% రేపటినుండి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పలాస ఆర్.ఓ.బికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని రైల్వే అధికారులు తెలపగా సంబంధిత ఆర్ డి ఓ మాట్లాడుతూ ఆర్ ఓ బి కి సంబంధించి పనులు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షా సమావేశానికి రెవిన్యూ డివిజన్ అధికారి సాయి ప్రత్యూష, ఎస్.ఈ ట్రాన్స్ కో కృష్ణమూర్తి, ఆర్ అండ్ బిఎస్ ఇ జాన్ సుధాకర్, ఎస్డిసి యూనిట్ -4 లావణ్య, మార్కెటింగ్ ఎడిబి రవికుమార్, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి

విశాలాంధ్ర - కవిటి : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రహి, మండల ఇంజనీరింగ్ అధికారి పి ప్రవీణ్ కుమార్ లు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ప్రభుత్వం అందజేసే నిధులపై ఇప్పటి నుండి గ్రామ పంచాయతీలకు అవసరమైన మౌలిక వసతులపై ఇప్పటి నుండి సరైన ప్రణాళికలు తయారు చేసి ఆవిధంగా వచ్చే నిధులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వంశీ, ఏపీఎం గోవింద్, ఏపీవో టీ మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శులు, డీఏలు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర - జలుమూరు : వాతావరణ కేంద్రం తుఫాన్ హెచ్చరిక చేయడంతో ప్రతి గ్రామంలో రైతులు ఆందోళనతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వర్షాలు నుంచి పంట రక్షణ కోసం పొలాల నుండి బయటకు తీసుకు పోతూ కుప్పలను ఏర్పాటు చేస్తున్నారు. చాలా గ్రామాల్లో గ్రామానికి చివరగా పంట పొలాలు ఉన్నందున అక్కడి నుండి వరిచేలు తేవడానికి రైతులు పడుతున్న బాధలు అన్నీ ఇన్ని కావు, ఒక వైపు సకాలంలో కూలీలు దొరక రైతులు పడుతున్న బాధలు భగవంతుడికి ఎరుక ఏ క్షణాన వర్షాలు ఉధృతమవుతాయేమోనని రైతుల ఆందోళన చెందతున్నారు.

సత్యదేవునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలం అల్లినగరంలోని శ్రీరమా సత్యన్నారాయణ స్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు చైతన్యశర్మ, సుధాకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురిటి భార్గవీ ప్రసాద్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్ల శ్రీనివాసుని ప్రార్థన మందిరంలోనూ మండలంలోని వివిధ విష్ణు ఆలయాల్లోను, శివాలయాల్లోనూ పూజా కార్యక్రమాల్లో భక్తులు తండోపతండాలుగా పాల్గొన్నారు.

టెక్కలి ఏఎస్ఐ సస్పెండ్

విశాలాంధ్ర - టెక్కలి : అవినీతికి పాల్పడిన కారణంగా టెక్కలి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ టీ నర్సింగరావు ను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ మధ్యకాలంలో ఓ గ్రానైట్ పారిశ్రమ నుండి 5000 రూపాయలు ఏఎస్ఐ డిమాండ్ చేసినట్టు ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. ఈ విచారణలో ఏఎస్ఐ పై వచ్చిన ఆరోపణలు రుజువు అయిన కారణంగా ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

యువశక్తితోనే దేశాభివృద్ధి : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : దేశాభివృద్ధిలో యువశక్తి భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువ ఉత్సవ్-2024లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ అభివృద్ధి ఉపయోగపడేలా కృషిచేయాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీని విరివిగా వినియోగిం చాల్సిఉందన్నారు. యువత ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలన్నారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ డిజిటల్ విధానం ద్వారా సుస్థిర ప్రగతికి దోహదపడాలన్నారు. నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ కె.వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న విద్యా సాంస్కృతిక నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవ్ను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్. తేజ, యువ ఉత్సవ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అనూరాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, సెట్ సీఈవో బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యటకాధికారి ఎన్. నారాయణరావు, రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. ఈ ఉత్సవ్లో భాగంగా సైన్స్ వేళా, పంచప్రాణి, జానపద నృత్యాలు, చిత్రలేఖనం, పద్యం, ఫోటోగ్రఫీ, ఉపన్యాసం ఏడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు లేని భరోసా

ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి

విశాలాంధ్ర - హిరమండలం : ఊరించి ఊరించి ఎట్టకేలకు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం 2,94,427కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి అరకొర కేటాయింపులే చేశారని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల సేకరణ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో పలు పాఠశాలలను సందర్శించారు. ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భగీరథపురం, హిరమండలం నందు ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్లో మొత్తం విద్యారంగానికి కేటాయించిన 32,235కోట్లుగాని కేవలం పాఠశాల విద్యకు కేటాయించిన 29,909 కోట్లు గాని విద్యారంగ ప్రగతికి ఏమాత్రం సరిపడవని మొత్తం బడ్జెట్లో పాఠశాల విద్యకు కేటాయింపులు 10% కూడా దాటలేదని ఇది బడుగు బలహీన వర్గాల పిల్లలపై సవతితల్లి ప్రేమను తలపిస్తుందని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం ఉద్యోగులకు 21,980 కోట్లు బకాయిలు పెట్టిందని వల్లె వేసి శాసనసభలో ఆర్థికశ్వేతపత్రంలో ఇదే మాటను వల్లె వేసిన ముఖ్యమంత్రిగారిని అనుసరించారే తప్ప వాటిచెల్లింపుల ప్రస్తావన ఈ బడ్జెట్లో ఎక్కడా లేదని, పన్నెండవ వేతనసవరణకు, డిఎ బకాయిలు, అరియర్లు, పెండింగ్ పియఫ్, ఏపీజియల్ఐ లోన్లు, పాతపెన్షన్ అమలకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా కూటమి సర్కారు ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఇలా అయితే కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల ఆగ్రహం తప్పదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరుమార్చుకోకుంటే ఎస్టీయుగా, ఫ్యాప్టోగా సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టనుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రామకృష్ణ, మండల అధ్యక్షులు బి.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీలో మేలైన పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - కవిటి : రబీ పంటలైన రాగి, పెసర, మినుము సాగులో మేలైన పద్దతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసా యాధికారి బి.దుర్గా ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నెలవంక గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనాలు చేశారు. అనంతరం వరి పంటను పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ అసిస్టెంటు సాయి కుమార్, రైతులు బి.హేమాచలం, రుక్మాంగద రావు, డి.తులసయ్య, ఉమాపతి, తమ్మయ్య, వాసుదేవు రావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి గౌతు శివాజీని కలిసిన డీఎస్పీ

విశాలాంధ్ర - పలాస : మాజీ మంత్రి గౌతు శివాజీని మంగళవారం కాశీబుగ్గ డి.ఎస్.పి వి. వెంకట అప్పారావు మర్యాద పూర్వకంగా కలిసారు. డిఎస్పిగా నూతన ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన శాంతిభద్రల విషయంపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ పార్ల మెంటరీ కార్యదర్శి పీరుకట్ల విఠల్ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - కంచిలి : మండలం నుండి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బూరగాం ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు నిరంజన కడంగా, కంచిలి మండల ప్రాథమిక పాఠశాల సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు జర్జాన భగవత్ రావు, నువగడ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాడి, నువగడ ఉన్నత పాఠశాల సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయులు చంద్రమణి గొమాంగోని కంచిలి మండల కేంద్రంలో గల సిఐటియు ఆఫీసు వద్ద ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, కంచిలి మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లండ బాబురావు, జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, మండల అధ్యక్షులు మురళి నాయక్, మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, కోశాధికారి టి త్రినాథ్, సహ అధ్యక్షులు జాకబ్ లిమ్మో, పూర్వ జిల్లా కార్యదర్శి సమల్ల వెంకట్రావు, క్రాంతి కుమార్, శ్యాంసుందర్, పురుషోత్తం, త్రిలోచన ప్రధాన్, చంద్రమౌళి, బుల్లుబెహరా, నిరంజన్ పాల్గొన్నారు.

వేరుశెనగ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలో తామరా పల్లి, జమ్ము గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి, కె.సునీత రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు కె-6రకం వేరుశెనగ విత్తనాలు అంద చేశామన్నారు. తామరాపల్లి గ్రామ రైతులకు 65.10 క్వింటాళు ్ళ విత్తనాలు పంపిణీ చేయగా, జమ్ము గ్రామ రైతులకు 65.10 కింటాళ్ళ విత్తనాలు అందించామన్నారు. వరి కోతల అనంతరం మెట్టు వ్యవసాయ భూముల్లో వేరుశెనగ విత్తనాలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - టెక్కలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన 2024- 2025 వ్యవసాయ బడ్జెట్ రైతులకు అనుకూలమైన బడ్జెట్ గా ఉపయోగపడుతుందని జిల్లా యాదవ సాధకారి కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలో రావివలస పంచాయతీ చిన్న నారాయణపురం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వ్యవసాయ మంత్రి, విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చిత్రపటాలకు మంగళవారం గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం పట్ల కూటమి ప్రభుత్వం చూపించిన ప్రేమను ఎప్పటికీ మరువలేమని, ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు ఎంతో సహాయముతో మేలు చేకూరుతుందని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి శీను బాబు, దాసరి వాసుదేవ్, తురక మల్లేసు, తురక కృష్ణారావు,దాసరి ధర్మరాజు, దాసరి రామయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ముసుగులో చెరువు ఆక్రమణ.. అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న కేటు గాళ్లు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఎచ్చెర్ల మండలం కుశాలపురం రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నెంబర్ 157 లో నరసన్న చెరువు 15. 30 ఎకరాల విస్తీర్ణం లో ఉండేది. నగరం లోని కొందరు పేదలు గతం లో ఆ చెరువు గట్టున ఆవాసం ఏర్పాటు చేసుకొని నివసించే వారు. ఇప్పుడు ఆ భూమిపై కొందరి అక్రమార్కుల కన్ను పడి వారు కూడా పేదల ముసుగులో చెరువును ఆక్రమించి అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అడిగితే పేదలు ఏదో ఉండడానికి చిన్న చిన్న షెడ్డు లు వేసుకుంటున్నారు అని వారే వత్తాసు పలికి ఆ ముసుగులో వీరు కూడా కొంత ఆక్రమించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణ పై గతం లో స్పందన లో పిర్యాదు చేస్తే రెవిన్యూ అధికారులు విచారణ చేసి అక్కడ గత 30 ఏళ్ల నుంచి కొందరు పేదలు చిన్న చిన్న షెడ్డుల్లో నివాసం ఉండడం నిజమని తేలింది. అయితే పేదల ముసుగులో కొందరు అక్రమార్కులు చెరువును ఆక్రమించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇపుడు ఆ ప్రాంతం లో పెద్ద పెద్ద భవనాలు వెలుస్తున్నాయి. అక్కడ ఎటువంటి చర్యలు తీసుకున్న నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుందని వెనకడుగు వేస్తుంటే అదే అదునుగా అక్రమార్కులు రెచ్చిపోయి ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయి. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి నిజమైన పేదలను గుర్తించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ళ నిర్మాణం చేపట్టి ఆక్రమణకు గురైన చెరువును కాపాడాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇలానే అధికారులు చోద్యం చూస్తే కొన్నాళ్ళకు ఆ చెరువే లేకుండా కనుమరుగయ్యే పరిస్థితి దాపురిస్తుందని, చెరువులను కాపాడాల్సిన బాధ్యత అందరి మీద ఉందని అంటున్నారు. అమ్ముకున్న వాటి పై చర్యలు తీసుకొని ఇక మీదట ఆక్రమణ జరగకుండా చూస్తే చెరువును కాపాడడం తో పాటు నిజమైన పేదలను గుర్తించి వారికి న్యాయం చెయ్యాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ప్రజా సమస్యలపై ధర్నా

విశాలాంధ్ర - పలాస : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పలాస కార్యదర్శి ఎన్ గణపతి పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో మంగళవారం సిపిఎం ప్రజా పోరు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలకు భిన్నంగా విద్యుత్ చార్జీలు పెంచి, ఇసుక అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని ఈ ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ ధిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కాశీబుగ్గ డీ.ఎస్.పి వి.వెంకటఅప్పారావు

విశాలాంధ్ర - పలాస : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్.పి వి.వెంకట అప్పారావు హెచ్చరించారు. కాశీబుగ్గ డిఎస్.పిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం డి.ఎస్.పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలాస పరిసర ప్రాంతాల్లో మందు బాబులు, గంజాయి సేవించిన ఆకతాయిలు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన, అతి వేగంతో వాహనాలు నడిపిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే వాళ్ళ తల్లిదండ్రులపై కేసు పెట్టే అవకాశాలు ఉంటాయని, తల్లితండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచర్ల పై నిఘా ఉంచామని తెలిపారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, సోషల్ మీడియాను మంచి కోసం ఉపయోగించాలని, ఎటువంటి తప్పుడు పోస్టులు పెట్టినా కేసులు కడతామని హెచ్చరించారు. అసభ్యకరమైన డాన్సులు చేసిన, నిర్వాహకుల పైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. బెల్ట్ షాప్ లు, అక్రమ ఇసుక రవాణా,నాటు సారాపై ప్రత్యేక నిఘా పెట్టామని, పేకాట వంటి అసాంఘిక ఆటలు ఆడే వారికి కేసులు కడతామని తెలిపారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో ట్రాఫిక్ పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని జిల్లా ఎస్.పితో సంప్రదించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. భూ దందాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందనీ, ఎవరైనా బెదిరింపులకు పాల్పడినట్లు పిర్యాదులు అందితే వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాశీబుగ్గ సిఐ మోహన్ రావు పాల్గొన్నారు.

చిన్నారి చదువుకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం పెద్దబొడ్డపాడు పంచాయితీ పరిధి సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన సుస్మిత ఉన్నత చదువు కోసం గ్రామ యువకులు మంగళవారం చిన్నారికి రూ.23 వేల విలువ గల బ్యాంక్ బాండ్‌ను అందజేసారు. సుస్మిత తండ్రి తమ్మినాన రాజారావు (36) కొన్ని నెలల క్రితం కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. అయితే ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మృతుని కుటుంబానికి అండగా నిలిచేందుకు శ్రీ కాళీమాత వాట్సాప్ గ్రూప్ వేదికగా విరాళాలు సేకరించి కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. కంచిలి మోడల్ స్కూల్లో ఇంటర్ చదువుతున్న సుస్మిత రానున్న రోజుల్లో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో గ్రామ కమిటీ సభ్యులు హనుమంతు శివకుమార్, హెచ్.అప్పలస్వామీ, కె.చలపతిరావు, రేవతి ఉన్నారు.

ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర - మందస : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతాంగ సమస్యలు సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు అన్నారు. మంగళవారం హరిపురం మార్పు గ్రంథా లయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ వర్షాభావ పరిస్థితులు వలన చాలా గ్రామాల్లో పంటలు పాడైపో యాయని, కనుక గ్రామానికి యూనిట్‌గా తీసుకొని ఇన్సూరెన్సు ద్వారా పంట నష్ట పరిహారం అందించాలని, స్వామినాధన్ కమిటీ సిఫార్సు మేరకు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని, ఉపాధి హామీ పనులను రైతులకు అనుసంధానం చేయాలని, రైతులకు విత్తనాలు 90శాతం సబ్సిడీకి అందించాలని అన్నారు. కార్యక్రమంలో బెస్తా కామేశ్వరరావు, త్రిలోచన, దాసరి శ్రీరాములు, లింగరాజు, రాపాక చిన్నారావు, సింహాద్రి, రామారావు, కిల్ల తవిటయ్య, కొర్ల హేమారావుచౌదరిలు పాల్గొన్నారు.

6 కార్పొరేషన్లకు డైరెక్టర్లు నియామకం

విశాలాంధ్ర - మందస : రాష్ట్రంలో 6 కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించినట్లు ప్రభుత్వం కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోదన తెలిపారు. కురుబ, కళింగ, వన్యకుల, ఆర్యవైశ్య, శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించిందని, పలాస నియోజక వర్గం నుంచి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భావన దుర్యోదన, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుత్తుం లక్ష్మణ్‌కుమార్, పుచ్చ ఈశ్వరరావులను నియమితులయ్యారని తెలిపారు. వీరిని నియమకం పట్ల కృషి చేసిన ఎమ్మెల్యే శిరీషాకు శుభాకాంక్షలు తెలిపారు.

వైన్ షాప్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్ మెన్లు, సూపర్వైజర్లులను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయుసి నాయకులు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్లో మంగళవారం ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం షాపుల్లో పలువురిని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకుందని, ప్రస్తుత ప్రభుత్వం మద్యం పాలసీ విధానాన్ని మార్చి వారి యొక్క కుటుంబాలను వీధిన పడేసిందని ఆవేదన చెందారు. వారికి రావలసిన బకాయి పడ్డ జీతాలు, బోనస్ లు కూడా ప్రభుత్వం చెల్లించాలని కోరారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం శ్రీకాకుళం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా బొత్స సంతోష్, కార్యదర్శిగా టి.కిషోర్, ఉపాధ్యక్షులుగా పి కిరణ్ కుమార్, టి.రాజా సహాయ కార్యదర్సులుగా కే.శ్రీను అనిల్, కోశాధికారిగా కే.రామోజీరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు, మద్యం దుకాణాల కార్మికులు పాల్గొన్నారు.

నేడు వయో వృద్ధుల పోషణ.. సంరక్షణ చట్టం 2007పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : భారత ప్రభుత్వం వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన వయో వృద్ధుల సంరక్షణ చట్టం 2007 పై బుధవారం శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆవరణలో బుధవారం 10:30 కు జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంరక్షణ శాఖ సహాయ సంచాలకులు కె. కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న వయో వృద్ధులు, పిల్లల నిర్లక్ష్యానికి గురి అయిన తల్లి దండ్రులు ఈ సదస్సుకు హాజరు కావాలని ఆమె కోరారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆమె కోరారు.

సంస్థాగతంగా పార్టీని బలోపాతం చేద్దాం

పార్టీ నాయకులతో నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : క్షేత్రస్థాయిలో ఉన్న పార్టీ కార్యకర్తలను, జగన్మోహన్ రెడ్డి అభిమానులను చైతన్యం చేసి ముందుకు తీసుకుని వెళ్లి సంస్థగతంగా పార్టీని బలోపేతం చేద్దామని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడు తిలక్ అన్నారు. మండలం దండుగోపాలపురంలో, పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొని పార్టీ అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు పై మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నిలబడే వాడు జగనన్న అభిమాని అని, అధికారంలోకి వచ్చిన తర్వాత మీ అందరినీ గౌరవించే బాధ్యత నాది అని అన్నారు. సోషల్ మీడియా, పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులను అందరం సమిష్టిగా ఎదుర్కొని ముందుకు సాగుదామని అన్నారు. నష్టం జరిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదుకునే బాధ్యత నాది అని భరోసా ఇచ్చారు. ఇల్లు తొలగించిన, ఇల్లు బిల్లులు చెల్లించకపోయిన కోర్టుకు వెళ్లి న్యాయం చేస్తామని అన్నారు. అర్హులకు పింఛన్లు ఇవ్వకపోయినా, ఉన్నవి తొలగించిన పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి మోహన్ రెడ్డి, నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, భూషణ్ రెడ్డి, తై నారాయణ, అంగ జనార్ధన్, నక్కిట్ల నరేష్, అంగ.అప్పారావు, పంగరామయ్య, మార్పు అశోక్ చక్రవర్తి, అంగం మల్లేష్, పంగ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర - మెలియాపుట్టి : వేరుశనగ, మినుము విత్తనాలను పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల మధుబాబు రైతులకు రాయితీపైన పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి దానకర్ణుడు నేతృత్వంలో మంగళవారం గొప్పలి, గోకర్ణపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పండించే రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని, అలా చేయటం వల్ల వేరుశనగను ఆశించే వేరుకుళ్ళు తెగులు నుంచి రక్షించుకోవచ్చున్నారు. వేరుశనగ పంటలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, జిప్సం ఎరువులను తప్పకుండా వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. అలాగే మినుము, పెసర పంటలలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులతో పాటు రబిలో పండించే పంటల పైన అవగాహన కల్పించడంతోపాటు రబీలో పండించే వేరుశనగ, మినుము, పెసర, పంటలకు పంటల భీమా ప్రీమియం నేరుగా రైతులు చెల్లించుకుని పంటల భీమా పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దానకర్ణుడు సర్పంచ్ రవికుమార్, కూటమి నాయకులు వాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు పావని, వాసు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

యుటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - కంచిలి : స్థానిక సీఐటీయూ భవనంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏపీ యు టి ఎఫ్ కంచిలి మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికైనది.ఈ ఎన్నికకు జిల్లా అధ్యక్షులు ఎల్ బాబురావు, జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్ ఎన్నికలు అధికారిగా వ్యవహరించారు. సీనియర్ యుటిఎఫ్ సభ్యులు ఎస్. వెంకటరావు, బి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులు త్రిలోచన ప్రధాన్ ఉండగా అధ్యక్షులు గా మురళి నాయక్ ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి నల్లాన రవి ని ఎన్నుకున్నారు. సహాధ్యక్షులు గా జాకబ్ లిమ్మ, మహిళా సహాధ్యక్షురాలు అనురాధ, కోశాధికారి టీ త్రినాథ్, అడిట్ కమిటీ కన్వీనర్ జె.భగబతి రావు, సీపీస్ కన్వీనర్: బుల్లు బెహర ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్ల ను మరియు మండల కార్యదర్శుల ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా మహిళా కమిటీ ని కూడా నియమించారు. సోమవారం జరిగిన మండల మహాసభకు నలభై ఐదు మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. మండల మహాసభ లో పైన తెలపబడిన కమిటీఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే జిల్లా మహాసభలు హరిపురంలో ఈ నెల ఇరవై నాలుగు ఇరవై ఐదు జరగనున్నాయని తెలిపారు. మండలం తరపున ఎక్కువ మంది ఉపాధ్యాయులు పాల్గొనాలని జిల్లా అధ్యక్షులు బాబురావు పిలుపునిచ్చారు. అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోరెడ్ల విజయ గౌరీని గెలిపించి శాసన మండలకు పంపించాలని ఉపాధ్యాయులను కోరారు.

వన్యప్రాణులను తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠా గుట్టు రట్టు

విశాలాంధ్ర - మందస : వన్యప్రాణులను తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠా గుట్టును కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు రట్టు చేశారు. కాశీబుగ్గ అటవీ రేంజ్ పరిధిలో ఇచ్చాపురం చెక్ పోస్ట్ వద్ద కారులో వన్య ప్రాణులను తరలిస్తున్న ముగ్గురు కర్ణాటకకు చెందిన స్మగ్లర్ల ను కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన అంతర్రాష్ట్ర వన్యప్రాణుల స్మగ్లర్ల గ్యాంగ్ కారులో ఒడిశా నుంచి కర్ణాటకకు వన్యప్రాణులతో వెళ్తుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కారును సీజ్ చేసిన అటవీ అధికారులు అందులో ఉన్న 17 కొండచిలువల పిల్లలు, మూడు తాబేళ్లు, ఒక అడవి పిల్లిలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా వన్య ప్రాణులను కాశీబుగ్గ అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుకున్న వన్యప్రాణులను విశాఖ జూకు తరలిస్తామని కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ఏ మురళీ కృష్ణమ నాయుడు విలేకరులకు తెలిపారు.

జెఈఈ మెయిన్స్‌పై 'పద్మావతి'లో అవగాహన సదస్సు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మంగళవారం జెఈఈ మెయిన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు విషయ నిపుణులు, బి.విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి టైం మేనేజ్‌మెంట్, రివిజన్ ఎంతో కీలకమని తెలిపారు. అలాగే పాత ప్రశ్నా పత్రాలను ప్రాక్టీస్ చేయటం ద్వారా వేగం, కచ్చితత్వం విద్యార్థుల్లో పెరుగుతుందని అన్నారు. ఎన్.సీ.ఈ.ఆర్.టి పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయటమే కాక, ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక ఏకాదశి ఉత్సవాలు ..

తండోపతండాలుగా భక్తులు

విశాలాంధ్ర - జలుమూరు : కార్తీక మసం ఏకాదశి మంగళవారం పర్వదిన సందర్భంగా జలుమూరు మండలం చిన్నదూగాం జంక్షన్‌లో కొలువైయున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు భక్తులు సందర్శన ఖాళీ లేదు. అదే విధంగా జోంనకి పంచాయతీ అబ్బాయిపేట గ్రామంలో కొలువైయున్న శ్రీ మురళీకృష్ణ ఆలయాన్ని భక్తులు సందర్శించి ఏకాదశి పూజలు నిర్వహించారు. తరతరాలుగా వస్తుంది సాంప్రదాయాన్ని పల్లెలో ప్రజలు భక్తి భావాలతో ఆనందంగా ఉత్సవాలు జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు తులసి చెట్లు వనభోజనాలు చేపట్టారు.

వైభవంగా సత్యన్నారాయణ స్వామి పూజలు

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రపెరుమళ్ల స్వామి ఆలయం వద్ద మంగళవారం ఏకాదశి సందర్భంగా సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో బార్యభర్తలు ఈ వ్రతాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటి వారు తీర్థ ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొందల కృష్ణారావు, కుమారి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయితీల అభివృద్ధిపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - పలాస : మండలంలో గల గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పంచాయితీ అభివృద్ధి పై దృష్టి సారించాలని ఎంపీడీవో వసంత కుమార్ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామ పంచాయతీల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయకపోతే కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిచి పోతాయన్నారు. పంచాయతీలో తయారు చేసిన ప్రణాళికలను పరిశీలించి కేంద్రం నిధులతో పాటు అవార్డులు ప్రకటిస్తుందని, ఆ దిశగా కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించా లన్నారు. తయారు చేసిన అభివృద్ధి ప్రణాళికలు, నిర్వహించిన గ్రామసభ వివరాలను ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

గ్రామాల్లో భూ సమస్యలు తీర్చడానికే గ్రామసభలు

విశాలాంధ్ర - పోలాకి : రెవెన్యూ గ్రామలలో భూ సమస్యలు తీర్చడానికే గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తునట్లు తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కొండలక్కి వలస రెవెన్యూ గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన భూ రీ-సర్వేలో భాగంగా రైతులు భూ సమస్యలు తప్పిదాలను సరిచేసి నవరిస్తున్నట్లు పేర్కొన్నారు. 26 రెవెన్యూ గ్రామాల్లో నేరుగా రైతులతో మాట్లాడి భూ సమస్యలు లేకుండా సరి చేస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు 330 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిటి గాయత్రి మండల సర్వేయర్ పి.వెంకటరమణ కె అమ్మి నాయుడు వీఆర్వో చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకహోమం

విశాలాంధ్ర - మందస : కార్తీక ఏకాదశి సందర్భంగా మందస మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వర, వాసుదేవుని, విష్ణు, జగన్నాధస్వామి ఆలయాలతో పాటు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము 3 గంటల నుంచే ఆలయాల వద్ద భక్తులు భక్తి నామస్మరణతో క్యూ కట్టారు. పితాతొళి గ్రామంలో రామనామ, కృష్ణనామ పారాయణం ఏకహెూమం మహోత్సవ కార్యక్రమం అంగ రంగ వైభవంగా జరిగింది. 24 గంటల పాటు రామనామ, కృష్ణనామ కార్యక్రమం జరిగింది.

వాహనాలను అడ్డుకున్న ఏనుగుల గుంపు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు బత్తిలి రూటులో తలాడ గ్రామ ప్రధాన రోడ్డు పై మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మూడు ఏనుగుల గుంపు బత్తులి వైపు వెళ్తున్న ఏపిఎస్ ఆర్టీసీ బస్ ను కొత్తూరు వైపు వెళ్తున్న కొన్ని. లారీ లు ఇతర వాహనాలను మూడు ఏనుగుల గుంపు రోడ్ అడ్డంగా నిలబడడంతో ఎక్కడ వాహనాలు అక్కడ నిలిచూ పాయాయి వాహనదారులు, బస్ లో ఉన్న ప్రయాణికులు భయపడ్డారు ద్విచక్ర వాహనాదారులు తమ వాహనాలను విడిచి పరుగులు తీశారు.

అభివృద్ధి సంక్షేమం మేళవింపునకు ప్రతిబింబంగా ఉన్న బడ్జెట్ : కణితి కిరణ్

విశాలాంధ్ర - టెక్కలి : అభివృద్ధి సంక్షేమం మేళవింపునకు ప్రతిబింబంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టిందని టెక్కలి జనసేన ఇన్‌చార్జ్ కణితి కిరణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలకు అద్దం పట్టే విధంగా బడ్జెట్ ఉందన్నారు. సంపద సృష్టించాలన్న సీఎం ఆలోచనలను ఆచరణలో పెట్టే విధంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవులు అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. అమ్మఒడి, ఉచిత బస్సు పథకానికి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించడం సంతోషకర విషయం అని అన్నారు. గత పాలనలో మోసపోయిన అన్ని వర్గాలకు అన్ని రంగాలకు న్యాయం చేసే విధంగా బడ్జెట్లో కూటమి ప్రభుత్వం కేటాయింపులు చేసిందన్నారు. రూ.2.94 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్లో అత్యధికంగా విద్యా, నైపుణ్య రంగం, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి-రాష్ట్ర రహదారుల కోసం కేటాయింపులు చేశారన్నారు. రైతు అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా రూ 43,402 కోట్లతో ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ కూడా ప్రవేశపెట్టిందన్నారు. అందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జగన్ బడ్జెట్ సమావేశాలకు మొహం చాటేయడం బాధ్యతా రాహిత్యమని బాధ్యత లేని వారికి ప్రతిపక్షం అనే మాట ఉచ్చరించే అర్హత లేదని ఈ సందర్భంగా ద్వజమెత్తారు. ఆయనతోపాటు జనసేన సైనికులు బుడ్డ గవరయ్య, కుమారస్వామి, త్రివేణి రావు, గద్దయ్ భాస్కర్, ఆబోతు రమణ, ఇలాపండ రమేష్, హరి తదితరులు ఉన్నారు.

మాజీ సీఎం జగన్మోహనరెడ్డిని కలిసిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలానికి చెందిన పలువురు వైకాపా నాయకులు మాజీముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్ ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వారిలో సంతబొమ్మాళి మండల వైకాపా పార్టీ అధ్యక్షులు కోత సతీష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొందల రామకృష్ణ, మేఘవరం పంచాయితీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాస్ రెడ్డి, ఏదురు శ్రీనివాస్ రెడ్డి, మాజీ విద్యాశాఖ డైరెక్టర్ ఊర్జన విశ్వనాథం ఉన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

విశాలాంధ్ర - నందిగాం : పంచాయతీల అభివృద్ధికి 2025-26 ఏడాదికి ప్రణాళికలు రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి గోపి బాల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో రాజారావు అధ్యక్షతన మంగళవారం పంచాయితీ కార్యదర్శులకు, గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై ఒక్కరోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు.

పంచాయతీ నిధులు స్వాహా

విశాలాంధ్ర - నందిగాం : మండలం పెద్ద తామరపల్లికి చేరాల్సిన రూ.60వేలు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ గుటకాయ స్వాహా చేశారని మండల తెలుగు యువత నాయకుడు పోలాకి డిల్లేశ్వరరావు ఆరోపించారు. పెద్ద తామరపల్లి మంచినీటి కోనేరులో చేపల పెంపకానికి టెక్కలి కంద్ర వీధికి చెందిన హిరంబో 22 నుంచి 24 జూన్ వరకు ఆ సొమ్ము చెల్లించగా వీరు పంచాయతీకి జమ చేయకుండా నిధులు సొంత ఖర్చులకు వాడుకున్నారని, వారిచే పంచాయతీకి జమ కట్టించాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేయిస్తామని ఎంపీడీవో రాజారావు పేర్కొన్నారు.

తమ్మినేనిని కలిసిన చింతాడ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : శాసనసభ మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంటరీ అధ్యక్షులు తమ్మినేని సీతారాంను కొత్తగా నియమించ బడ్డ ఆమదాల వలస నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త చింతాడ రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమదాల వలస లోని సీతారాం ఇంటికి వెళ్లి మంగళవారం కలిసి సీతారాం ఆశీస్సులు తీసుకున్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - నందిగాం : విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బాహ్య ప్రపంచంలో ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. మండలం బడగం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి ఉపాధ్యాయుడు భుజంగరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల్లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తే విద్యార్థులు పలు విషయాలు నేర్చుకుంటారని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి ఎంపీయుపి స్కూల్ రట్టి మందస మండలం రెండవ బహుమతి సంతబొమ్మాళి ప్రభుత్వం ఉన్నత పాఠశాల తృతీయ బహుమతి నందిగామ మండలం కనితివూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఆవరణలో కదంబల మొక్కను డీఈవో నాటారు.

ఘనంగా కార్తీక ఏకాదశి

విశాలాంధ్ర - నందిగాం : మండలం లోని పెంటూరు, సుభద్రాపురం, సుబ్బంపేట గ్రామా ల్లో ఉన్న విష్ణు ఆలయాల్లో కార్తీక శుద్ధ ఏకా దశిని పురస్కరించుకొని మంగళ వారం భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు తరలివెళ్ళి స్వామివారులను దర్శించు కున్నారు.. సుబ్బమ్మపేటలో నెలకొన్న లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి దంపతులు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ...

విశాలాంధ్ర - టెక్కలి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయం టెక్కలిలో 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిని రూపవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి చేతుల మీదుగా 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయ అధికారిని మాట్లాడుతూ వివిధ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విద్యార్థులు పాఠకులు గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం చిన్నకర్రివాని పాలెం గ్రామంలో శ్రీ గణేష్ తీర మత్స్యకార సహకార సంఘం నూతన పాలక వర్గంలో ఫిషరీస్ డెవలప్మెంటు అధికారి ధర్మరాజు పాత్రో ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా మేలపట్టి చంద్రశేఖర్,ఉపాధ్యక్షునిగా మాగుపల్లి పురషోత్తం, కార్యదర్శిగా నూరాడ రవిరాజు, డైరెక్టర్లుగా చీకటి.హేమరాజు, బడే నరేంద్ర, మద్దు జోగారావు, మోసా జోగారావు, ఎర్రిపిల్లి తాతారావు, మాగుపిల్లి రామారావులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు పలాస ఏడీఎఫ్ వై.సత్యన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి పదవీ కాలం ఐదు సంవత్సరాలు ఉంటుందని, మత్స్యకారులు అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రి లచ్చయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిషేధించాలి

విశాలాంధ్ర - కవిటి : గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ డి. మధుర మీనాక్షి అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి వెలుగు కార్యాలయంలో గ్రామ సమైక్య సంఘాల అధ్యక్షులు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల రక్షణకు ప్రతీ గ్రామ పంచాయతీలో బాలల రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే దత్తత మరియు అనాధికార దత్తత వలన కలిగే నష్టాలను వివరించారు. స్పాన్సర్షిప్ పథకం, పోస్టర్ కేర్, ఆస్టర్ కేర్ కార్యక్రమాల గురించి ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనుమంతి లేకుండా బాలబాలికలతో హాస్టల్స్ నిర్వహించేవారిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపీఎం గోవింద్, వెలుగు సీసీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కవిటి : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయా లని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి మండల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ద్వారా అనేక సమస్యలపై పోరాటం చేస్తున్నామని, ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ రావలసిన ఆర్థిక బకాయిలు,పీఆర్సీ,డీఏలు గురించి బడ్జెటులో నిధులు కేటాయించలేదని,ఈ బడ్జెటు ఉపాధ్యాయులను నిరాశ పరిచిందని అన్నారు. నవంబరు 24, 25వ తేదీలలో మందస మండలం హరిపురంలో జరగబోవు జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, కవిటి మండల అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సీతాం నాయుడు,సీనియర్ కామ్రేడ్స్ త్రినాధ నాయుడు, జానకి రావు, మనోజ్, సూర్యం, శ్రీధర్, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

విశాలాంధ్ర - సోంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహించటం జరిగింది. ఈ మినీ జాబ్ మేళాకి 02 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. దీనిలో 43 మందికి ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 12 మంది వివిధ కంపెనీలలో ఎంపికకావటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉద్యోగాల కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంపెనీలే మన వద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. అదేవిధంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా సరే దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ముందు ఉద్యోగంలో చేరి తర్వాత ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.డి. రామారావు గారు,వైస్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, జే.కే.సి కోఆర్డినేటర్ బడ్డ రాంబాబు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ తేజేశ్వరరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వినియోగదారుల నుంచి దోపిడీ

విశాలాంధ్ర - పలాస/మందస : పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ నిత్యవసర సరుకులు పంపిణీలో బాహాటంగా అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలతో పాటు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉన్నాయి. ఈ నెలలో నిత్యవసర సరుకులు పంపిణీలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ప్రతీ గ్రామంలోని, మున్సిపాలిటీలో ఉన్న వార్డుల్లో ఎండియు వాహనాల ద్వారా నిత్యవసర రేషన్ బియ్యం పంపిణీలో తూనికలు కొలతలు పరికరాలు ద్వారా వినియోగదారులకు మోసం జరుగుతుంది. వాహనం యాజమానికి చెందిన గోనెసంచిలో బియ్యం నింపి తూకం వేయడం వలన ఒక్కొక్క వినియోగదారునికి రేషన్ కార్డుకు 750 నుంచి 800 గ్రాముల బియ్యం తరుగు వస్తుంది. ఒక్కొక్క రేషన్ కార్డు వినియోగదారుని వద్ద వాహన యాజమానికి మిగులుతున్న బియ్యం నియోజకవర్గం వ్యాప్తంగా ఒక్కొక్క మండలంలో వందలాది క్వాంటాలు బియ్యం, ఈ బియ్యాన్ని రైస్‌మిల్లర్ల యాజమానులకు మధ్య దళారుల ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. రేషన్ డిపో డీలర్లు, వాహన యాజమానులు కుమ్మక్కై రేషన్ బియ్యం పక్కదారి ఇలా పట్టిస్తున్నారు. కేజీ కందిపప్పు 67రూపాయలకు అమ్మాలి.. కాని 70 రూపాయలకు వినియోగదారుని నుంచి వసూళ్లు చేస్తున్నారు. అర కేజీ పంచదార 17 రూపాయలకు ఇవ్వాలి కాని 20 రూపాయలకు వినియోగదారుని నుంచి వాహన యజమానులు డీలర్లు కలిసి వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ ధర కందిపప్పు, పంచధారలపై 6 రూపాయలు అదనంగా వినియోగదారుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. ఇకపోతే నిబంధనలకు భిన్నంగా డిపోలు వద్దే నాసిరకమైన నకిలీ సబ్బులు వినియోగదారునికి ఇచ్చి పది రూపాయలు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. అనధికారికంగా పంపిణీ చేస్తున్న ఈ సబ్బులను బలలవంతంగా వినియోగదారునిపై రుద్ది 10 రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. నాసిరకమైన నకిలీ సబ్బులను ప్రజలు వినియోగించకుండా ఆరు బయట చెత్త కుప్పలపై పారేస్తున్నారు. కాగా ప్రతీ నెల వాహనాలు ద్వారా సరఫరా అవుతున్న బియ్యంలో 750 నుంచి 800 గ్రాముల వరకు కోత విధించి రేషన్‌కార్డు వినియోగదారునికి అందించి వినియోగదాల్ని దోపిడీ చేస్తున్నారు. మరో రేషన్ డిపోల డీలర్లకు సరఫరా అవుతున్న బియ్యంలో కూడా తరుగు ఉంటుంది. క్వింటా బియ్యం బస్తాకు 10 నుంచి 15 కేజీల వరకు తక్కువ ఉంటుందని సివిల్ సప్లయి శాఖ వారే బియ్యం తరుగుతో తమ డిపోలకు సరఫరా చేస్తున్నారని, దీనివలన ఆర్థికంగా నష్టపోతున్నామని డీలర్లు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారునికి, డీలర్లకు సరఫరా అవుతున్న సరుకుల్లో కొరత (తరుగు) లేకుండా చూడాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు.

విద్యారంగానికి 9.8% నిధులు కేటాయించటం శోచనీయం

యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : శాసన సభలో విద్యారంగానికి బడ్జెట్‌లో 9.8%నిధులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించటం శోచనీయమని యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బమ్మిడి శ్రీరామమూర్తి విమర్శించారు. సోమవారం సాయంత్రం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ గత బడ్జెట్‌తో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని, ఈ నిధులు విద్యా రంగ అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడవని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం పాఠశాల విద్యా వ్యవస్థను అస్త వ్యస్థం చేసిందని, దానిని తిరిగి పునర్ నిర్మించే పని ఈ కూటమి ప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించటం తగదన్నారు. అంతేకాక ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి 30%నిధులు తమ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని కొఠారి కమీషన్ చెప్పిందని తెలిపారు. అలాగే నాడు-నేడు పనులకు నిధులు లేకపోవటం వలన నూతనంగా నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయన్నారు.

అలాగే ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు గురించి 12వ పి.ఆర్.సికి సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రస్తావించక పోవటం పట్ల తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించటం కోసం బడ్జెట్‌లో నిధులను పెంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లితండ్రులకు ఆసక్తి పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పల్లె పండుగ పనుల్లో నిర్లక్ష్యం వద్దు : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : పల్లె పండుగ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలసి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లాలో గత నెలలో శంకుస్థాపన చేసిన నిర్మాణ పనుల ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన పలువురిపై క్రమ శిక్షణా చర్య తీసుకుంటున్నామన్నారు. ఇంకా ఏఈ లపై చర్యలు తీసుకునే పరిస్థితికి రాకుండా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సిమెంట్ రోడ్ల నాణ్యత కాల పరిమితి 30 సంవత్సరాల ఉంటుందని నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని తెలిపారు. ఏజెన్సీలు, సిమెంటు, ఇసుక ఇతర మెటీరియల్ ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే ఆ నిధులను అవసరమైన వేరే ప్రాంతానికి కేటాయిస్తామని అన్నారు. అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్ట్రీ) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పుట్టినతేదీ ధ్రువపత్రాలు లేకపోవడం వల్లే అపార్ ఆలస్యం అవుతోందని, అలాంటి వారి చేత వెంటనే సచివాలయాల్లో సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బర్త్ సర్టిఫికేట్లను వెంటనే మంజూరు చేయాలని, జిల్లాలో 70 వేల మందికి పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని, 10 రోజుల్లో అలాంటి వారికి వాటిని అందజేయాలని ఆదేశించారు. సూర్య ఘర్ పథకానికి వచ్చే వారం నాటికి 2000 గృహాలను గుర్తించాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ ప్రగతి, సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జల వనరుల శాఖ ఎస్ఈ పి. సుధాకర్, సిపిఓ ప్రసన్నలక్ష్మి, డిఆర్డిఏ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఓ బి.మీనాక్షీ పలువురు అధికారులు హాజరయ్యారు.

నీటి కొరతను నుండి విముక్తి

విశాలాంధ్ర - కంచిలి : మండలం భోగాబెని పంచాయతీలో గల బాస్ బంజరి గ్రామంలో గత కొంత కాలం గా మంచినీటి కొరత ఉండడం వలన పంచాయితీ నిధులు తో సుమారు లక్ష యాభై వేలు రూపాయలు తో స్థానిక సర్పంచ్ గణప సింహాచలం చొరవతో బోరు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బొండాడ వైకుంతరావు, వార్డ్ మెంబర్ బొండాడ నేలవేణి లింగరాజు, వంకల జయరాం, సాలీనా మోహన్ రావు, బొండాడ తుంబనాథం, వంకల జగ్గారావు, బొండాడ వాసు, సాలీనా చిన్నమ్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలి

జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : చదువుకున్న వయసులో క్రీడలుతో పాటు చదువుల్లో కూడా రాణించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో రాణించి జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని జిల్లా ఎస్పీ కే.వీ.మహేశ్వర రెడ్డి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 8వ వ తేది నుంచి మూడు రోజులు నంద్యాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్), బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలో శ్రీకాకుళం జిల్లాకు గర్ల్స్ విభాగంలో తృతీయ స్థానాన్ని గెలుపొందారు. ఈ మేరకు గెలుపొందిన క్రీడాకారులు మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ని గౌరవ పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ క్రీడాకారులతో మాట్లాడి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. క్రీడల్లో మరింతగా రాణించాలని క్రీడాకారులు ను ఎస్పీ ప్రోత్సహించారు. జాతీయస్థాయి' బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు (హెూంగార్డ్ రాజేశ్వరరావు కుమార్తె) ఎస్.నందిని, ఎం. గాయత్రీ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ.. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చూపి క్రీడల్లో విజయం సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - మెళియాపుట్టి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. మంగళవారం మండలంలోని గంగరాజుపురం పంచాయతీకి చెందిన సంతోష్ బిస్వాల్(25) గంగరాజుపురం నుండి ట్రాక్టర్ పై సుందరాడ గ్రామానికి భజన కై వెళ్తుండగా పెద్ద పద్మాపురం గ్రామం చెరువు వద్ద ట్రాక్టర్ పై నుండి జారిపడిఅక్కడికక్కడే ప్రమాదానికి గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూతగా నగదు చెక్కు అందజేత

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెూంగార్డు పాలక సెంబుడు కుటుం బానికి ఆర్థిక చేయూతగా నగదు చెక్కును జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. శ్రీకాకుళం జిల్లా హెూంగార్డు విభాగము నందు హెూంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన హెూంగార్డు పి సెంబుడు సతీమణి సోములమ్మ నకు సహచర హెూంగార్డు ఉద్యోగులు అందరు కలిసి ఆర్థిక సహాయంగా స్వతహాగా ఇచ్చిన సుమారు 4.06 లక్షల నగదు చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. హెూంగార్డు సెంబుడు మరణించడం చాలా బాధాకరమని, ఏటువంటి సమస్య, అవసరం ఉన్న యెడల పోలీసు శాఖ అండగా, ఎల్లవేళలా తోడుగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, ఏ.ఓ. సి.హెచ్. గోపినాథ్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్‌లు హరినాథ్, రవి హెూం గార్డు కుటుంబ సభ్యులు ఉన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజేష్, చినబాబు

విశాలాంధ్ర - కవిటి : కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కవిటి మండలంకు చెందిన జనసేన జిల్లా కార్యదర్శి లోళ్ల రాజేష్, టీడీపీ సీనియర్ నాయకులు పార్టీ ఆవిర్భావం నుండి విశేష సేవలందిస్తున్న బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బార్ల చినబాబును కార్పొరేషన్ డైరెక్టర్లగా నియమిస్తు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్చార్జి దాసరి రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి అందరూ సహకరించాలి

విశాలాంధ్ర - జలుమూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి మనందరం కృషి చేయవలసి ఉందని మండల అధ్యక్షుడ వాన గోపి అన్నారు. మంగళవారం జలుమూరు మండలం పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిపి డిపి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సంక్షేమం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా నడవాలని దీనికి మనందరం కృషి చేయవలసిన బాధ్యత ఉందని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల అభివృద్ధి అధికారి కే అప్పల నాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి ఈ ఉమామహేశ్వరరావు, పలువురు కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అన్నెపు భువనేశ్వర్ రావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అన్నెపు భువనేశ్వర్ రావుని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన గతం లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శిగా, ప్రతిష్టాత్మకమైన శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా వినియగదారుల సమాఖ్య మెంబర్ గా వివిధ హెూదాల్లో పని చేశారు. జిల్లా ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు ద్వారా పలు సేవలను అందచేశారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఈయన నియామకం పట్ల ఆయన స్వస్థలం ఎచ్చెర్ల మండలంలోని కొత్తపేట గ్రామస్తులు హర్షం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ గా అవకాశం ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అదేవిధంగా ఈ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు నిరంతరం ప్రభుత్వ సేవలను అందిస్తానని ఆయన అన్నారు.

జగన్మోహన్ రెడ్డిని కలిసిన నర్తు

విశాలాంధ్ర - కవిటి : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ నర్తు.రామారావు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో టీడీపీ నాయకులు జరుపుతున్న అరాచకాలపై, నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు. సంక్షేమ పథకాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఆయనతో చర్చించినట్లు రామారావు తెలిపారు. ఇంకను వైకాపా పార్టీ తరుపున చేయాల్సిన కార్యక్రమాలను తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మంచినీటి బోర్ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీలో బూలోకమ్మ తల్లి గుడి, నూకలమ్మ తల్లి అమ్మ గుడి వద్ద మరువాడ సర్పంచ్ ప్రతినిధి సురాడ దాసురాజు మంగళవారము భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీరప్రాంత గ్రామాలకు రక్షిత మంచినీరు అందించే కార్యక్రమంలో భాగంగా భూమి పూజ చేశామని అన్నారు. అలాగే మంచినీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య, గ్రామపెద్దలు సూరాడ కృష్ణమూర్తి, సూరాడ నిరకరి, కోవిరివీరభక్తులు, మేరుగు నర్సింహులు, చొక్కర క్రిష్ణ, గంట లోకేష్, గోవింద క్రిష్ణ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్థంబాన్ని ఢీ కొట్టిన ఆటో...

విశాలాంధ్ర - టెక్కలి : మండలం రావివలస గ్రామంలో మంగళవారం ప్రయాణీకులతో వెళ్తున్న ఒక ఆటో అదుపుతప్పి విద్యుత్ స్థంబాన్ని ఢీకొట్టింది. ఎండల మల్లన్న ఆలయ దర్శనానికి వెళ్లేందుకు భక్తులతో వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి విద్యుత్ స్థంబాన్ని ఢీకొనడంతో విద్యుత్ స్థంభం విరిగిపోయింది. ఈ ఘటనలో ఆటో దెబ్బతినగా, ఆటో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. ప్రయాణీకులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఫైజర్ హెల్త్కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - రణస్థలం : అనకాపల్లి జిల్లా.సెంటర్ ఫర్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై వారు ఫైజర్ హెల్త్కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారికి అభ్యర్థులను రిక్రూట్మెంట్ ద్వారా ఎంపిక చేయబడును. తేదీ: 17-11-2024 సమయం: ఉదయం గం. 8:30 ని.లకు శ్రీ సాయి డిగ్రీ కాలేజీ, రణస్థలం. జెడ్పీ హెచ్ఎస్ స్కూల్ ప్రక్కన, రణస్థలం, ఇంటర్మీడియట్ పాస్ (50శాతం సైన్స్ గ్రూపులు మాత్రమే) డిగ్రీ మొదటి సంవత్సరం అభ్యర్థులు అర్హత పాసైన సంవత్సరం: 2023 / 2024 (తొలి ప్రయత్నంలో) స్త్రీలు మాత్రమే వయస్సు: 18 సం॥ల నుండి 20 సం॥ లోపు జీతం: 13,500/- రవాణా సౌకర్యం కలదు పై చదువుల కొరకుసంస్థ ద్వారా మద్దతు ఉంటుంది. ఎంపిక విధానం: సెలక్షన్ టెస్ట్ ం ఇంటర్వ్యూ ం ఆఫర్ లెటర్ ం మెడికల్ టెస్ట్ (అభ్యర్థులతో పాటు తల్లిదండ్రులు లేదా సంరక్షకులు రిక్రూట్మెంట్ ప్రోసెస్కు రావచ్చును.) అభ్యర్థులు తమ 10వ తరగతి ం ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ం ఆధార్ కార్డు ం 3 సెట్స్ జిరాక్స్ కాఫీలు ం 3 పాస్పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావలెను. అభ్యర్థులు ఎవరికి ఎటువంటి ఫీజు చెల్లించవలసిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు సంప్రదించండి 8919182007, 9347055910 సంప్రదించాలని కోరారు.

రామానుజన్ గణిత శాస్త్రపోటీల్లో సత్తాచాటిన ప్రదీప్.

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం రుంకు హనుమంతపురం గ్రామానికి చెందిన టంకాల ప్రదీప్ ఇటీవల నిర్వహించిన గణిత శాస్త్ర పితామహుడు సివి రామన్ గణిత పోటీ పరీక్షల్లో టంకాల ప్రదీప్ పాల్గొని సత్తా చాటార. ఇటీవల నిర్వహించిన గణిత శాస్త్ర పోటీ పరీక్షల్లో పాల్గొని తృతీయ స్థానాన్ని సాధించారు ఈ మేరకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రదీప్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక ఇవ్వడం పట్ల బోరుభద్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాగోటి రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. స్థానిక గణిత శాస్త్ర పోటీ పరీక్షల్లో ప్రతిభ సాధించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రభుత్వ విప్‌గా బెందాళం అశోక్



విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వ విప్ గా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించారు. ఇచ్ఛాపురం నుంచి మూడు సార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించింది అశోక్ కు విప్ గా నియమించడం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా నుంచి ఒక కేంద్ర మంత్రి, ఒక రాష్ట్ర మంత్రి పదవి తో పాటు ఇప్పుడు విప్ గా అశోక్ ను నియమించడం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని గిలాయి వీధిలో వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తేజేశ్వర శర్మ ఆధ్వర్యంలో సామూహిక సత్యన్నారాయణ వ్రతాలను నిర్వహించారు. వేకువఝాము నుండి ప్రత్యేక అర్చనలు నిర్వహించాక సత్యన్నారాయణ వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలో వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 180 జంటలు వ్రతాల్లో పాల్గొన్నారు. గత 31 సంవత్సరాలుగా కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఒడిశాకు చెందిన మరమోహన్ పండా, పూరీకి చెందిన నిమా పండాలతో పాటు రాంబట్ల సాయిజగన్నాథశర్మ తదితరులు సహకరించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన బిర్లంగి విద్యార్థులు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఇటీవల అన్నమయ్య జిల్లాలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న బిర్లంగి పాఠశాల తరగతి విద్యార్ధినులు తమ సత్తా చాటారు. అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని బాకి కవిత ప్రథమ స్థానంలో, అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి పరపటి ధర్మరాజు, అండర్ -19 విభాగంలో 10వ తరగతి విద్యార్థి బర్ల కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి,రమణ, గ్రామ పెద్దలు లక్ష్మినారాయణ, దూపాన దేవి తదితరులు అభినందించారు.